క్లుప్తంగా

రఘువరన్‌కు డాక్టరేట్



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన పుల్లా రఘువరన్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. మంగళవారం జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ కులపతి జిష్ణు దేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణ, యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ ఎస్.కుమార్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ దీప్లా పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ ఇంటర్వెల్ ట్రెనింగ్ ఆన్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఫిట్‌నెస్ అండ్ ఫిజియోలాజికల్ వేరియబుల్స్ ఆఫ్ ట్రెబల్ స్టూడెంట్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్' అనే పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినందుకు రఘువరన్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం ఆయన కొత్తగూడెంలోని ఎంజేపీటీబీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ



ఆత్మకూరు : మండలంలోని తిరుమలగిరిలో గల కేజీబీవీ పాఠశాలలో బుధవారం కెనరా బ్యాంక్ ఆత్మకూరు శాఖ అధ్వర్యంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కెనరా విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ సీనియర్ మేనేజర్ చింతల నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వాసవి, పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

దామెర : తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకోవాలని ప్రముఖ సినీగేయ రచయిత, సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తక్కళ్ల పహాడ్‌లో నిర్వహించిన పోచమ్మ బోనాల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పోచమ్మతల్లి కరుణచూపి పిల్లపాపలు, పాడిపంట చల్లగుండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట దాడి మల్లయ్య, శరబంధం, మహేశ్, గ్రామస్తులు ఉన్నారు.

సైన్స్ కాంగ్రెస్‌లో డిస్నీల్యాండ్ విద్యార్థుల ప్రతిభ



దామెర : తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో మండలంలోని డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచినట్లు ఆ పాఠశాల యాజమాన్యం తెలిపింది. కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కాగా మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల డిస్నీల్యాండ్ పాఠశాలకు చెందిన ఎం. నితిన్, దాసరి చరణ్ పాల్గొని ఓపెన్ వెల్ ఆర్గానిక్ ఫామ్ అనే అంశంపై ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి లభించింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎన్ఐటీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, కేయూ ప్రొఫెసర్లు డాక్టర్ ఇస్తారి, ఈసం నారాయణ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, లక్ష్మీనివాసం, డైరెక్టర్లు శోభారాణి, రాకేశ్‌భాను, దీనేష్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సేమ్‌టుసేమ్.. క్వాలిటీ చేంజ్

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిపాలన విభాగం చేసిన పనికి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. గ్రామ పంచాయతీ అవసరం నిమిత్తం సుమారు రూ.70వేలు ఖర్చు చేసి ఆహూజ ఆంపిల్ వైర్ సెట్‌ను కొనుగోలు చేశారు. అయితే ప్రత్యేక అధికారుల పాలన రాగానే కొందరి కన్ను ఆంపిల్ సెట్‌పై పడింది. మూడో కంటికి చిక్కకుండా దాన్ని మార్పిడి చేశారు. ఇదే కంపెనీకి చెందిన రూ. 10 వేల విలువచేసే సౌండ్ సిస్టంను కొనుగోలు చేసి ఆదే స్థానంలో అమర్చి నాణ్యత కలిగిన సౌండ్ సిస్టంను మాయం చేశారు. ఈ విషయమై ఎంపీఓ రంజిత్ కుమార్‌ను సాక్షి వివరణ కోరగా.. గ్రామ పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించినట్లు తెలిపారు. ఆంపిల్ వైర్ విషయంలో పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వివరణ ఇచ్చారు.

భారీ గుంతలు..తరచూ ప్రమాదాలు



రైల్వే గేట్‌కు సమీపంలో రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతలు



రైల్వే గేట్‌కు అవతలి భాగంలో ఏర్పడ్డ భారీ గుంతలు

- ఉప్పల్ రైల్వే గేట్ సమీపంలో ధ్వంసమైన రోడ్డు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు
- పాలకులు, అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు

కమలాపూర్ : మండల కేంద్రం నుంచి హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారి గుంతలతో దర్శనమిస్తోంది. నిత్యం వేలాది వాహనాలు ఆ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు, ముఖ్యంగా బొగ్గు లారీల రాకపోకలతో కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో ఉన్న రైల్వే గేట్‌కిరువైపులా భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ మార్గం గుండానే ప్రయాణిస్తున్నామని, భారీ గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికే పలువురు వాహనదారులు ఆ గుంతల్లో పడి గాయపడ్డారని, గుంతలు పూడ్చి ప్రమాదాలను నివారించాల్సిన అధికారులు పట్టించుకోకపోగా బొగ్గు కాంట్రాక్టర్ కూడా తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాడని వాహనదారులు మండిపడుతున్నారు. ధ్వంసమైన రోడ్డుపై ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని బుధవారం అర్చకులు ప్రదోషకాల నందీశ్వర అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నందీశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి శనిగలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. గర్భాలయంలో స్వామి వారికి, నందీశ్వరుడికి ఏకకాలంలో హారతి సమర్పించారు. ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ముఖ్య అర్చకులు మధుకర్ శర్మ, వేదపండితులు విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, మధుశర్మ, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సభను జయప్రదం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్

వేలేరు : ఈనెల 28వ తేదీన స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న వికలాంగుల, చేయూత పింఛన్ దారుల సన్నాహక సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, జిల్లా ఇన్‌చార్జ్ సోమన్న మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని కన్నారం గ్రామంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ దారులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. పింఛన్ పెంపు కోసం మంద కృష్ణ చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వేలేరు, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు మనోజ్‌కుమార్, రవీందర్, సాయిలు, యాదగిరి, వెంకటమ్మ, కనుకమ్మ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రంగానికి పునాది వేసిన రాజీవ్ గాంధీ



పరకాల : రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



శాయంపేట : రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పరకాల : దేశంలో ఐటీ రంగానికి పునాది వేసి, విదేశీ పెట్టుబడులను తీసుకొచ్చిన గొప్ప నాయకుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, సీఎస్ఐ కాలనీలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు చందర్, మాజీ కౌన్సిలర్స్ జయమ్మ, సంపత్, నాయకులు చిన్ని, గోనాథ్, రంజాన్‌అలీ, శ్రీశైలం, రాఘవరెడ్డి, సదానందం , శ్రీను, శ్రావన్, వసంత, శ్రావణ్ పాల్గొన్నారు.

శాయంపేట : దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



ఎల్కతుర్తి : బోనాలతో నృత్యాలు చేస్తున్న మహిళలు



పరకాలలో.



వేలేరు : పీచరలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరులో పోచమ్మ బోనాలు బుధవారం ఘనంగా జరిగాయి. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి బోనంతో డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో, కుటుంబ సభ్యులు సుఖ, సంతోషాలు, ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

పరకాల : బోనాలతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలోని పోచమ్మ దేవాలయం వద్ద సందడి నెలకొంది. బుధవారం అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు కోళ్లు, మేకలను నైవేద్యంగా సమర్పించారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పోచమ్మతల్లి, పెద్దమ్మతల్లి బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనం తయారు చేసుకుని డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయాలకు తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దొంగతనం కేసులో ఒకరికి 14 రోజుల రిమాండ్

శాయంపేట : గతనెల 28వ తేదీన మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మూల రాజుకు చెందిన కిరాణంలో దొంగతనం చేసిన వ్యక్తికి పరకాల మెజిస్ట్రేట్ బుధవారం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన మూల రాజు జులై 28వ తేదీన తన కిరాణం షాపు షెట్టర్‌కు తాళం వేసి వెళ్లాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆకారపు కుమారస్వామి తాళం ధ్వంసం చేసి షాపులోని రూ.10వేలు దొంగిలించాడు. రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారస్వామిపై కేసు నమోదు చేసి పరకాల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు. అతడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా ముగ్గురికి గాయాలు



108 వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ఐనవోలు : ఆటో బోల్తాపడిన సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన పలువురు కక్కిరాలపల్లి గ్రామంలోని ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కక్కిరాలపల్లి శివారుకు చేరుకోగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో 8 మంది ప్రయాణిస్తుండగా ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా 108 పైలెట్ కొండా తిరుపతి, ఈఎంటీ రాజు అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రులు వేల్పుల రజిని, వేల్పుల రాములు, వేల్పుల స్వామికి ప్రథమ చికిత్స అందించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరామర్శ

నడికూడ / దామెర : నడికూడ మండలంలోని కౌకొండ, చాటుపర్తి, నడికూడ గ్రామాలకు చెందిన గోల్కొండ శాంతమ్మ, దంచనాల కమలాకర్, ఎలుగటి రవీందర్‌రెడ్డితో పాటు పలు బాధిత కుటుంబాలను, దామెర మండలంలోని పులుకుర్తి, ఊరుగొండ, కోగిల్వాయిల్లో పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ఓదార్పు..

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు కన్నెబోయిన రమేశ్ తండ్రి సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సత్యపాల్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

ధోబి మహాసమాజ్ నాయకుల పరామర్శ

ఐనవోలు : పున్నేలు గ్రామానికి చెందిన గుడికందుల పరుశరాములు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అఖిల భారతీయ ధోబి మహాసమాజ్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జిల్లా, రాష్ట్ర, ఆల్ ఇండియా రజక సంఘం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. రజక సంఘం నాయకులు చంద్రయ్య, సుధాకర్, రవీందర్, వీరన్న ఉన్నారు.

రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలి



ధర్మసాగర్ : సమాజంలోని మానవులందరూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, నీతి, నిజాయితీ, సత్యం, ధర్మం, అహింసా మార్గాన్ని ఎంచుకోవాలని జన విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం రాష్ట్ర కన్వీనర్ ధర్మప్రకాశ్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మప్రకాశ్ మాట్లాడుతూ.. మానవుడి ఆలోచనలు నీతివంతంగా ఉండాలని అన్నారు. మానవులంతా రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్‌లో పొందుపరిచినట్లుగా శాస్త్రీయ దృక్పథం, మానవతా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. శాంతియుత సమాజ నిర్మాణానికి కృషిచేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ అలాగే మూఢ నమ్మకాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కవితాదేవి, సురేష్, పద్మజ, ప్రసన్న పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

ఎల్కతుర్తి : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై అక్కనేపల్లి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలో బుధవారం మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై జాగృతి పోలీస్ కళాబృదం అవగాహన కల్పించింది. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువత గంజాయి, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించి ఉన్నస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీటీమ్స్, ఈవిటీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి వివరించారు. పలు సామాజిక అంశాలపై జాగృతి పోలీస్ కళాబృదం పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థుల చేత మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపక బృదం, పోలీస్ సిబ్బంది, కళా బృదం సభ్యులు నాగమణి, విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, నారాయణ, విక్రమ్, రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో జెండా ఎగరేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాము



మాట్లాడుతున్న రాము

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి జెండా ఎగరేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాపూర్, కోగిల్వాయి గ్రామాల్లో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, మాజీ జెడ్పీటీసీ గరిగె కల్పనాకృష్ణమూర్తి, నాయకులు జాకిర్‌అలీ, కృపాకర్‌రెడ్డి, శంకర్, మ ల్లయ్య, సంపత్, బాబు, రంగారెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వానిది కపట ప్రేమ



మాట్లాడుతున్న ప్రణయ్

ఐనవోలు : బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఢిల్లీ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో బీజేపీ నుంచి బీసీ వర్గానికి చెందిన సీపీ రాధాకృష్ణను అభ్యర్థిగా ప్రకటించిందని, ఇండియా కూటమి బీసీ అభ్యర్థికి పోటీగా ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని పోటీకి దింపడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు రాజు, రవితేజ, విక్రమ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కమలాపూర్ : వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ నాగరాజు, సిబ్బంది



ఎల్కతుర్తి : మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి రెహమాన్

కమలాపూర్ : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్థానిక వైద్యాధికారి నాగరాజు సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని గూడూరు పల్లె దవాఖానా ఆధ్వర్యంలో బుధవారం నేరెళ్ల గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 59 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనుమానిత జ్వర పీడితులకు ఆర్‌డీటీ, బీఎస్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. పల్లె దవాఖానా వైద్యురాలు మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణారెడ్డి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వంగర పీహెచ్‌సీ వైద్యాధికారి రెహమాన్ సూచించారు. బుధవారం భీమదేవరపల్లి మండలంలోని కాశ కాలనీలో వైద్య శిబిరం నిర్వహించి జ్వరపీడితులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా, విరేచనాల బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ప్రజలు దోమ తెరలు వినియోగించాలని, ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని, పాత టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు, గాజు సీసాలు ఇంటి ఆవరణలో ఉంచొద్దన్నారు. వైద్య సిబ్బంది మోహన్, స్వరూప, ఆశ కార్యకర్తలు రజిత, జ్యోతి పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం..!

- గుంతల రోడ్డుపై గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామం నుంచి గంగిరేణిగూడెం వెళ్లే రోడ్డు గుంతలు పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ గౌస్ అన్నారు. బుధవారం గ్రామస్తులతో కలిసిన నిరసన తెలిపారు. అనంతరం గౌస్ మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం కోటి 16 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించినట్లు గుర్తుచేశారు. వాహనాల రాకపోకలతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు రోగాల బారినపడుతున్నా ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. దీంతో గ్రామాలు అభివృద్ధికి దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక దృష్టిసారించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. గ్రామస్తులు రమేశ్, సాంబయ్య, రాజయ్య, చిన్నన్న, తిరుపతి, శ్రీను, తిరుపతి, ఐలయ్య, రమేశ్, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కమలాపూర్ : తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుండేడుకు చెందిన విష్ణుదాసు వంశీధర్‌రావును నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాము, రాష్ట్ర చైర్మన్ జగన్‌మోహన్‌శర్మ బుధవారం తెలిపారు. ఈ మేరకు వంశీధర్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు.